RNI.No. TELTEL/2010/32434

# అన్వేష నేత్రం

ఎడిటర్ : గోల్ల రమేష్

తెలుగు దినపత్రిక

సంపుటి :11 సంచిక : 350 | శుక్రవారం 3 ఏప్రిల్ 2026 | హైదరాబాద్ | పేజీలు : 8 , రూ.1.00




## హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాల యాల్లో ఈడీ సోదాలు

పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు.

వార్త 2లో



## ఆ అధికారుల నిర్బంధం తెలి యదు.. పాలన నా చేతుల్లో లేదు: మమతా బెనర్జీ

మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులను నిర్బంధించడం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది.

వార్త 2లో



## ఇరాన్ యుద్ధంపై ఆస్ట్రేలియా ప్రధాని సంచలన వ్యాఖ్యలు

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ, అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రదేశమైన ఆస్ట్రేలియా నుంచి అనూహ్య వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ కూటమి కొనసాగిస్తున్న దాడుల ఉద్దేశాన్ని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ సూటిగా ప్రశ్నించారు. ఈ యుద్ధానికి ముగింపు ప్రణాళిక ఏంటని ఆయన నిలదీశారు.నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ప్రసంగించిన అల్బనీస్, "ఇరాన్‌లో ఇంకా సాధించాల్సింది ఏముంది?" అని నేరుగా వేసిన ప్రశ్న అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఇరాన్ అణ్వాయుధాలు పొందకుండా నిరోధించడం, దాని సైనిక సామర్థ్యాన్ని తగ్గించడం వంటి అమెరికా ప్రాథమిక లక్ష్యాలకు తాము మద్దతిచ్చామని ఆయన గుర్తుచేశారు.

వార్త 2లో



# గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

### మొదటి విడత నిధులు విడుదలపై హర్షం
### యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా
### నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం
### గ్రామ పంచాయతీ నిధుల విడుదలపై
### కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన..



**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు.**

తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రా భివృద్ధికి బాటలు వేస్తోందన్నారు.

వార్త 2లో

### నాడు హైదరాబాద్ అభివృద్ధికి
# చంద్రబాబు కృషి

### రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

**దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు నాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు.**

వార్త 2లో



### అఖిలపక్ష సమావేశానికి మోదీ
## గైర్హాజరు.. ప్రధాని ఎక్కడని నిలదీసిన ఖర్గే

పార్లమెంట్ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగింది. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకా కపోవడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ప్రశ్నించారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా బదులివ్వడంతో సభలో కాసేపు వేడి రాజుకుంది. "పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మీరు అఖిలపక్ష సమావేశం పెట్టారు. ఆ సమా వేశానికి ప్రధానమంత్రి ఎందుకు రాలేదు?" అని ఖర్గే ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇంధన ధరల పెరుగుదల వంటి కీలక అంశాలపై చర్చకు రాకుండా, ప్రభుత్వం తన అజెండాను ప్రతిపక్షాలపై రుద్దుతోందని ఆయన ఆరోపించారు.



వార్త 2లో

### మూసీ ప్రాజెక్టుపై ఎన్‌జిటిలో కాంగ్రెస్
# ప్రభుత్వానికి ఊరట..

ప్రతిష్టాత్మకంగా చేపట్టిన మూసీ ప్రాజెక్టుపై ఎన్‌జిటిలో కాంగ్రెస్ ప్రభుత్వానికి ఊరట లభించింది. మూసీ ప్రక్షాళనలో భాగంగా ప్రభుత్వం చేపట్టనున్న గాంధీ సరోవర్ ప్రాజెక్టుకు సంబంధించి నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ నుండి అనుకూలంగా తీర్పు వచ్చింది. ఎన్‌జిటి నుండి ముందస్తు అనుమతులు తీసుకోకుండానే పర్యావరణంపై ప్రభావం చూపే ఈ ప్రాజెక్టును చేపడుతున్నారని బిఆర్ఎస్ నాయకుడు పటోళ్ల కార్తీక్ రెడ్డి ట్రిబ్యునల్ లో పిటిషన్ దాఖలు చేశారు. గురువారం దీనిపై ట్రిబ్యునల్ విచారణ జరిపింది. కేవలం రాజకీయ దురుద్దేశంతోనే మూసీ ప్రాజెక్టును అడ్డుకుంటున్నారని ఈ సందర్భంగా ప్రభుత్వ తరపు న్యాయవాదులు వాదించినట్లు తెలుస్తోంది. రెండు వైపుల వాదనలు విన్న ట్రిబ్యునల్.. కార్తీక్ రెడ్డి పిటిషన్ ను డిస్మిస్ చేస్తున్నట్లు ప్రకటించింది. దీంతో ప్రాజెక్టుకు సంబంధించి ఎన్‌జిటి నుండి మార్గం సుగమమైనట్లే అని ప్రభుత్వ వర్గాలు భావిస్తున్నాయి.



### రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను
## కాంగ్రెస్ మోసం చేసింది: హరీష్ రావు

కాంగ్రెస్ సర్కార్ రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అమలు కాని హామీలలో అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా ముంచారని అన్నారు. సంగారెడ్డిలో బిఆర్ఎస్ లో చేరికలు కొనసాగాయి.

వార్త 2లో



# గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి

## మొదటి విడత నిధులు విడుదలపై హర్షం

### యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధం

### గ్రామ పంచాయతీ నిధుల విడుదలపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి ప్రకటన..

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వం గ్రామీణాభివృద్ధికి చిత్తశుద్ధితో కృషి చేస్తోందని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి అన్నారు. 15వ ఆర్థిక సంఘం సిఫార్సుల మేరకు 2025-26 సంవత్సరానికి సంబంధించిన మొదటి విడత నిధులు విడుదలపై ఆయన హర్షం వ్యక్తం చేశారు. తెలంగాణ గ్రామ పంచాయతీల కోసం రూ.619.85 కోట్లు విడుదల చేయడాన్ని స్వాగతించారు కేంద్ర మంత్రి. ఈ మేరకు ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర పంచాయతీరాజ్ శాఖ మంత్రి రాజీవ్ రంజన్ సింగ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం 'సబ్‌కా సాథ్.. సబ్‌కా వికాస్' మంత్రాన్ని అక్షరాలా ఆచరణలో పెడుతూ ప్రతి గ్రామం సమగ్రాభివృద్ధికి బాటలు వేస్తోందన్నారు. కేంద్రం విడుదల చేసిన రూ.619.85 కోట్ల నిధుల్లో రూ.371.91 కోట్లు టైడ్ గ్రాంట్, రూ.247.94 కోట్లు అన్ టైడ్ గ్రాంట్ కింద ఉన్నాయన్నారు. టైడ్ గ్రాంట్ నిధులతో గ్రామాల్లో రోడ్ల నిర్మాణం, పారిశుద్ధ్యం, తాగునీటి సరఫరా, మురుగునీటి శుద్ధి, వర్షపు నీరు సంరక్షణ, ప్రజల జీవన ప్రమాణాల పెంపు వంటి అనేక పనులు చేయవచ్చన్నారు. అన్ టైడ్ గ్రాంట్ నిధులను మాత్రం స్థానిక అవసరాలకు అనుగుణంగా గ్రామ సభల్లో నిర్ణయం తీసుకుని అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టుకోవచ్చని



కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు.

### కేంద్ర మంత్రి ప్రకటన ఇదే..

'15వ ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం.. గ్రామీణ స్థానిక సంస్థలకు కేటాయించిన నిధులు కేంద్రం నుంచి రాష్ట్రాలకు అందిన వెంటనే ఆయా రాష్ట్రాల ఆర్థిక శాఖలు 10 పని దినాలలోపు సంబంధిత గ్రామ పంచాయ తీలకు నిధులను వెంటనే బదిలీ చేయాల్సి ఉంటుంది. అంతకుమించి ఆలస్యం జరిగితే రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాల కోసం తీసుకున్న మార్కెట్ రుణాలు/రాష్ట్ర అభివృద్ధి రుణాల(రాణా)పై చెల్లిస్తున్న వడ్డీ రేటు ప్రకారం గ్రామ పంచాయతీలకు వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుంది. అలాగే కేంద్రం విడుదల చేసిన నిధులకు సమానంగా మ్యాచింగ్ గ్రాంట్లు విడుదల చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వానిదే. 2015-16 నుంచి 2019-20 వరకు 14వ ఆర్థిక సంఘం కింద రూ.5,060 కోట్లు విడుదల చేయగా.. 2020-21 నుంచి 2025-26 వరకు 15వ ఆర్థిక సంఘం కింద కేటాయింపులు 80 శాతం పెరిగి రూ.9,050 కోట్లకు చేరుకున్నాయి. దీంతో 14, 15వ ఆర్థిక సంఘాల కాలంలో కేంద్రం మొత్తం రూ.14,110 కోట్లు తెలంగాణకు కేటాయించింది. వీటిలో 2026 జనవరికి ముందే రూ.11,111 కోట్లు రాష్ట్రానికి కేంద్రం విడుదల చేసింది. 2024-25కు సంబంధించి 2026 జనవరి నుంచి ఇప్పటివరకు రూ.1,032.42 కోట్లను విడుదల చేసింది. తాజాగా 2025-26కు సంబంధించి రూ.619.85 కోట్లను మొదటి విడత కింద విడుదల చేసింది. ఇక, 16 ఆర్థిక సంఘం కింద 2026-27 నుంచి 2030-31 మధ్య కాలంలో తెలంగాణలోని గ్రామ పంచాయతీలు రూ.9,968 కోట్లను గ్రాంట్ రూపంలో కేంద్రం నుంచి పొందనున్నాయి. తెలంగాణ ప్రభుత్వం సకాలంలో పంచాయతీ ఎన్నికలు నిర్వహించని కారణంగా.. రెండేళ్ల పాటు (2023-24, 2024-25 ఆర్థిక సంవత్సరాలకు సంబంధించిన) నిధులు పెండింగ్‌లో ఉన్నాయి. ఇటీవల గ్రామ పంచాయతీలకు ఎన్నికలు జరిగిన తర్వాత కేంద్రం వాటిని విడుదల చేసింది. తాజాగా 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మొదటి విడత నిధులనూ కేంద్రం విడుదల చేసింది. గతంలో బీఆర్ఎస్, కాంగ్రెస్ ప్రభుత్వాలు గ్రామ పంచాయతీలకు నిధులు ఇవ్వకుండా కేంద్రం ఇచ్చిన నిధులను పక్కదారి పట్టించాయి. అయినప్పటికీ.. గ్రామాల అభివృద్ధి కోసం కేంద్రం యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పించగానే నిధులను విడుదల చేసింది. తెలంగాణలో పంచాయతీ ఎన్నికలను రేండెళ్లపాటు నిర్వహించకుండా స్పెషల్ ఆఫీసర్ల పాలనతో రాష్ట్ర ప్రభుత్వం నెట్టుకొచ్చింది. ఇకపైనా ఎప్పటికప్పుడు యుటిలైజేషన్ సర్టిఫికెట్లు సమర్పిస్తే తదనుగుణంగా నిధులను విడుదల చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉంది' అంటూ ప్రకటన జారీ చేశారు.

# నాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబు కృషి చేశారు

### రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

దూరదృష్టి గల నాయకుడిగా ఆనాడు హైదరాబాద్ అభివృద్ధికి చంద్రబాబునాయుడు కృషి చేశారని, విభజన తర్వాత ఏపీకి అమరావతి రాజధానిగా సంకల్పం తీసుకుని ముందుకు సాగుతున్నారని తెలంగాణ బీజేపీ నాయకుడు, రాజ్యసభ ఎంపీ డాక్టర్ కె. లక్ష్మణ్ అన్నారు. అమరావతికి ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారని, రెండు రాష్ట్రాల అభివృద్ధికి ఎన్డీయే కట్టుబడి ఉందని అన్నారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడారు. వికసిత్ ఆంధ్రప్రదేశ్ కోసం వికసిత్ రాజధాని అవసరమని ఆయన అన్నారు. రాజధాని అమరావతి కోసం 29 వేలమంది రైతులు 33 వేల ఎకరాలు ఇచ్చారని గుర్తు చేశారు. భవ్య రాజధాని కోసం ఏపీ ప్రజలు కలలు కన్నారని పేర్కొన్నారు. ప్రధాని మోదీ వికసిత్ భారత్ సంకల్పం సాకారమయ్యేందుకు వికసిత్ ఆంధ్ర నిర్మాణం అవశ్యమన్నారు. రాజధాని అవసరమని, కానీ జగన్ తన హయాంలో మూడు ముక్కలాడి రైతులు, మహిళలను ఇబ్బందులకు గురి చేశారని ఆరోపించారు. రాజధాని కోసం చాలాకాలంగా పోరాడిన మహిళలకు, రైతులకు ఆయన శిరస్సు వంచి నమస్కరిస్తున్నట్లు తెలిపారు. అమరావతి బిల్లు కోసం దేశం మొత్తం ఆసక్తిగా చూస్తోందని అన్నారు. తెలుగు వారికి ప్రత్యేక ఆంధ్రరాష్ట్రం కావాలని నాడు పొట్టి శ్రీరాములు 58 రోజులు నిరాహార దీక్ష చేసినా, నాటి కాంగ్రెస్ ప్రభుత్వం స్పందించలేదని మండిపడ్డారు. ఆంధ్ర రాష్ట్రం కోసం ఆయన ప్రాణాలు త్యాగం చేశారని అన్నారు. ఆయన మరణానంతరం ప్రభుత్వం స్పందించి ఆంధ్ర రాష్ట్రం ఇచ్చిందని అన్నారు.

# హైదరాబాద్ సహా పలు నగరాల్లోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఈడీ సోదాలు

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

పశ్చిమ బెంగాల్‌లో బొగ్గు స్మగ్లింగ్ కేసుకు సంబంధించి కేంద్ర దర్యాప్తు సంస్థ ఈడీ ప్రముఖ రాజకీయ కన్సల్టెన్సీ ఐప్యాక్ కార్యాలయాల్లో సోదాలు చేపట్టింది. హైదరాబాద్, బెంగళూరు, ఢిల్లీలోని ఐప్యాక్ కార్యాలయాల్లో ఏకకాలంలో ఈడీ అధికారులు సోదాలు చేపట్టారు. ప్రశాంత్ కిషోర్‌కు చెందిన ఐప్యాక్ ప్రస్తుతం పశ్చిమ బెంగాల్ అసెంబ్లీ ఎన్నికల్లో అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ కోసం పని చేస్తోంది. ఐప్యాక్ కన్సల్టెన్సీ డైరెక్టర్లలో ఒకరైన రిషిరాజ్ సింగ్‌కు చెందిన ప్రాంగణంపై కూడా దర్యాప్తు సంస్థ దృష్టి సారించింది. బొగ్గు స్మగ్లింగ్‌కు సంబంధించిన మనీలాండరింగ్ కేసులో కొంతకాలంగా సోదాలు జరుగుతున్నాయి. గతంలో బెంగాల్‌లోని ఐప్యాక్ కార్యాలయాలు, ఐప్యాక్ అధినేత ఇళ్లలో ఈడీ సోదాలు నిర్వహించింది. నాడు సోదాల సమయంలో ముఖ్యమంత్రి మమతా బెనర్జీ స్వయంగా అక్కడకు వచ్చి, మీడియా ఎదుటే ఫైళ్లతో వెళ్తూ కనిపించడం చర్చకు దారితీసింది. సోదాల సమయంలో బెంగాల్ ప్రభుత్వం నుంచి ఆటంకాలు ఎదురయ్యాయని ఈడీ అప్పుడు ఆరోపించింది. ఈ వ్యవహారంపై సుప్రీంకోర్టులో విచారణ జరుగుతోంది. మరోవైపు, మమతా బెనర్జీ కేంద్ర దర్యాప్తు సంస్థ ఆరోపణలను ఖండించింది. సోదాల పేరుతో ఈడీ తన పరిధిని ఉల్లంఘించిందని ఆరోపించారు.

# ఆ అధికారుల నిర్బంధం తెలియదు.. పాలన నా చేతుల్లో లేదు: మమతా బెనర్జీ

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

మాల్దా జిల్లాలో 'సర్' విధుల్లో ఉన్న ఏడుగురు జ్యుడీషియల్ అధికారులను నిర్బంధించిన విషయం తనకు తెలియదని పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ తెలిపారు. ఈ నెలలో బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికలు ఉన్నాయి. ఈ క్రమంలో అధికారులను నిర్బంధించడం ఆ రాష్ట్రంలో తీవ్ర దుమారం రేపుతోంది. సాగర్‌దిఘిలో జరిగిన బహిరంగ సభలో ఆమె మాట్లాడుతూ, అధికారుల నిర్బంధం తనకు తెలియదని, ప్రస్తుతం పాలన తన చేతుల్లో లేదని స్పష్టం చేశారు. అధికారుల నిర్బంధానికి బాధ్యులు ఎవరో తనకు తెలియదని ఆమె స్పష్టం చేశారు. ఈ విషయమై తనకు ఎవరూ సమాచారం కూడా ఇవ్వలేదని చెప్పారు. పరిపాలన తన చేతుల్లో లేదని, శాంతిభద్రతలను ఎన్నికల సంఘం నియంత్రిస్తోందని తెలిపారు. వారంతా కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షా మాట వింటున్నారని అన్నారు. అధికారులను కూడా కేంద్రం మార్చిందని ఆరోపించారు. తన అధికారాలన్నీ ఈసీ చేతిలోకి వెళ్లాయని అన్నారు. ఓటర్ల జాబితా సమగ్ర సర్వే (ఎస్ఐఆర్)పై ప్రజలు చాలా కోపంగా ఉన్నారని మమతా బెనర్జీ అన్నారు. మాల్దాలో జరిగిన అధికారుల నిర్బంధం ఘటన బీజేపీ కుట్రలో భాగమని ఆమె ఆరోపించారు. అసెంబ్లీ ఎన్నికను రద్దు చేయించి, రాష్ట్రంలో రాష్ట్రపతి పాలన విధించాలని బీజేపీ భావిస్తోందని అన్నారు. న్యాయాధికారులకు రక్షణ కల్పించడంలో ఎన్నికల సంఘం విఫలమైందని ఆరోపించారు. తనకు అర్ధరాత్రి సమయంలో ఒక జర్నలిస్టు ద్వారా నిర్బంధం విషయం తెలిసిందని వెల్లడించారు.

# అఖిలపక్ష సమావేశానికి మోదీ గైర్హాజరు.. ప్రధాని ఎక్కడని నిలదీసిన ఖర్గే

పార్లమెంట్ వేదికగా అధికార, ప్రతిపక్షాల మధ్య మరోసారి మాటల యుద్ధం జరిగింది. పశ్చిమాసియా సంక్షోభంపై ప్రభుత్వం ఏర్పాటు చేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోదీ హాజరుకాకపోవడాన్ని రాజ్యసభలో ప్రతిపక్ష నేత మల్లికార్జున ఖర్గే తీవ్రంగా ప్రశ్నించారు. దీనిపై పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు గట్టిగా బదులివ్వడంతో సభలో కాసేపు వేడి రాజుకుంది. "పశ్చిమాసియా ఉద్రిక్తతలపై మీరు అఖిలపక్ష సమావేశం పెట్టారు. ఆ సమావేశానికి ప్రధానమంత్రి ఎందుకు రాలేదు?" అని ఖర్గే ప్రభుత్వాన్ని సూటిగా ప్రశ్నించారు. ఇంధన ధరల పెరుగుదల వంటి కీలక అంశాలపై చర్చకు రాకుండా, ప్రభుత్వం తన అజెండాను ప్రతిపక్షాలపై రుద్దుతోందని ఆయన ఆరోపించారు. తాము ప్రతినిధులను పంపినా ప్రధాని రాలేదని, కేవలం ఉపన్యాసాలు వినడానికి తాము రావాలా అని నిలదీశారు. ఖర్గే వ్యాఖ్యలపై కిరణ్ రిజిజు ఘాటుగా స్పందించారు. దేశం క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ప్రతిపక్షాలు రాజకీయం చేయడం దురదృష్టకరమని అన్నారు. అదే అఖిలపక్ష సమావేశానికి లోక్‌సభ, రాజ్యసభలోని ప్రతిపక్ష నేతలు ఎందుకు హాజరు కాలేదని ఆయన ఎదురు ప్రశ్నించారు. ప్రభుత్వం ఏ చర్చ నుంచీ వెనక్కి తగ్గడం లేదని, ఇప్పటికే ఈ అంశంపై ప్రధాని, మంత్రులు ఉభయ సభల్లో ప్రకటనలు చేశారని గుర్తుచేశారు. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య యుద్ధం కారణంగా అంతర్జాతీయంగా చమురు ధరలు పెరుగుతున్నాయి. దీని ప్రభావంతో దేశంలో గ్యాస్, పెట్రోల్ ధరలు పెరగొచ్చని విపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. ఈ నేపథ్యంలోనే వ్యూహరచన కోసం ప్రభుత్వం సర్వపక్ష భేటీని ఏర్పాటు చేసింది. అయితే ఈ సమావేశానికి ప్రధాని గైర్హాజరు కావడం రాజకీయ దుమారానికి కారణమైంది.

# ఇరాన్ యుద్ధంపై ఆస్ట్రేలియా ప్రధాని సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

పశ్చిమాసియాలో కొనసాగుతున్న ఉద్రిక్తతల నడుమ, అమెరికాకు అత్యంత సన్నిహిత మిత్రదేశమైన ఆస్ట్రేలియా నుంచి అనూహ్య వ్యాఖ్యలు వెలువడ్డాయి. ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ కూటమి కొనసాగిస్తున్న దాడుల ఉద్దేశాన్ని ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంథోనీ అల్బనీస్ సూటిగా ప్రశ్నించారు. ఈ యుద్ధానికి ముగింపు ప్రణాళిక ఏంటని ఆయన నిలదీశారు. నేషనల్ ప్రెస్ క్లబ్‌లో ప్రసంగించిన అల్బనీస్, "ఇరాన్‌లో ఇంకా సాధించాల్సింది ఏముంది?" అని నేరుగా వేసిన ప్రశ్న అంతర్జాతీయంగా చర్చనీయాంశమైంది. ఇరాన్ అణ్వాయుధాలు పొందకుండా నిరోధించడం, దాని సైనిక సామర్థ్యాన్ని తగ్గించడం వంటి అమెరికా ప్రాథమిక లక్ష్యాలకు తాము మద్దతిచ్చామని ఆయన గుర్తుచేశారు. అయితే, ప్రస్తుత దాడులతో ఆ లక్ష్యాలు ఇప్పటికే నెరవేరాయని, అయినప్పటికీ యుద్ధాన్ని ఎందుకు పొడిగిస్తున్నారో అర్థం కావడం లేదని అభిప్రాయపడ్డారు. ఈ సంక్షోభం ఎంతకాలం కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థకు అంత నష్టమని, ముఖ్యంగా ఇంధన ధరలు, సరఫరా వ్యవస్థలపై తీవ్ర ప్రభావం పడుతుందని అల్బనీస్ హెచ్చరించారు. ఈ యుద్ధం ప్రారంభించే ముందు తమను ఎవరూ సంప్రదించలేదని స్పష్టం చేసిన ఆయన, ఆస్ట్రేలియా ఇందులో ప్రత్యక్షంగా పాలుపంచుకోవడం లేదని స్పష్టం చేశారు. అయినప్పటికీ, భౌగోళికంగా దూరంగా ఉన్నా ఆర్థికంగా తాము భారీ మూల్యం చెల్లించాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. అమెరికాకు కీలక మిత్రపక్షంగా ఉన్న దేశం నుంచి ఇలాంటి విమర్శలు రావడం ప్రాధాన్యత సంతరించుకుంది.

# రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసింది: హరీష్ రావు

హైదరాబాద్:

కాంగ్రెస్ సర్కార్ రాష్ట్ర యువతను తీవ్రంగా దగా చేసిందని మాజీ మంత్రి హరీష్ రావు ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వ పాలనపై ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత ఉందని, అమలు కాని హామీలలో అధికారంలోకి వచ్చి ప్రజలను నిలువునా ముంచారని అన్నారు. సంగారెడ్డిలో బిఆర్ఎస్ లో చేరికలు కొనసాగాయి. హరీష్ రావు సమక్షంలో పటాన్ చెరు నియోజకవర్గ కాంగ్రెస్ సోషల్ మీడియా ప్రతినిధులు, కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ ఎండి ఆరిఫ్ సహా 25 మంది చేరారు. గులాబీ కండువాలు కప్పి హరీష్ రావు పార్టీలోకి ఆహ్వానించారు. ఈ



సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ.. కాంగ్రెస్ దుర్మార్గాలను చూడలేకే కాంగ్రెస్ పార్టీ వాళ్లు బిఆర్ఎస్ లో చేరుతున్నారని, జాబ్ క్యాలెండర్ లేదు, కొత్తగా ఉద్యోగాల కల్పన లేదని విమర్శించారు. రెండు లక్షల ఉద్యోగాల హామీ పూర్తిగా బోగస్ అయ్యిందని, అవ్వాతాతలకు పెన్షన్లు పెంచలేదని మండిపడ్డారు. మహిళలకు రూ.2500 ఇవ్వలేదని, రైతన్నల హామీలు నెరవేర్చకుండా, రాష్ట్రంలోని అన్ని వర్గాల ప్రజలను కాంగ్రెస్ మోసం చేసిందని ధ్వజమెత్తారు. ప్రజా సమస్యలు వెలుగులోకి తేవడంలో సోషల్ మీడియాదే కీలకపాత్రని, సోషల్ మీడియాలో ఎప్పటికప్పుడు కాంగ్రెస్ మోసాలను ఎండగట్టాలని హరీష్ రావు సూచించారు.

# భారీగా తగ్గిన బంగారం, వెండి ధరలు..

హైదరాబాద్:అన్వేషనేత్రం ప్రతినిధి

పసిడి ప్రియులకు గుడ్ న్యూస్. గత కొన్ని రోజులుగా తగ్గుతూ.. పెరుగుతూ వస్తున్న బంగారం, వెండి ధరలు మరోసారి భారీగా తగ్గాయి. గురువారం హైదరాబాద్ బులియన్ మార్కెట్ లో 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధరపై రూ.1,530 తగ్గగా.. 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధరపై రూ.1,400 తగ్గింది. దీంతో తెలుగు రాష్ట్రలో 24 క్యారెట్ల తులం బంగారం ధర రూ.1,51,420కు చేరుకుంది. ఇక, 22 క్యారెట్ల 10 గ్రాముల గోల్డ్ ధర రూ.1,38,800కు తగ్గింది. అలాగే, వెండి ధర కూడా భారీగా తగ్గింది. ఒక్కరోజే రూ.10 వేలు తగ్గడంతో కిలో వెండి ధర రూ.2,55,000కు చేరుకుంది.

# అమరావతిపై రాజకీయ కోణంలో చూసి విమర్శలు చేయవద్దు: బీజేపీ ఎంపీ ఆర్ కృష్ణయ్య

హైదరాబాద్: అన్వేషనేత్రం ప్రతినిధి

ఆంధ్రప్రదేశ్ రాజధానిగా అమరావతి అభివృద్ధి అవశ్యమని, దీనిని రాజకీయ కోణంలో చూసి విమర్శలు చేయవద్దని బీజేపీ రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య విజ్ఞప్తి చేశారు. అమరావతి చట్టబద్ధత బిల్లుపై రాజ్యసభలో చర్చ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఏపీ రాజధానిగా అమరావతికి పూర్తి మద్దతు ఇస్తున్నట్లు తెలిపారు. రాష్ట్రం మధ్యలో అమరావతి ఉంటుందని, పాలనాపరంగా సౌలభ్యంగా ఉంటుందని అన్నారు. రాజధాని అభివృద్ధికి ముఖ్యమంత్రి చంద్రబాబు ఎంతో కృషి చేశారని అన్నారు. అందరికీ ఆమోదయోగ్యమైన రాజధానిని అందరూ సమర్థించాలని కోరారు. తెలుగు రాష్ట్రాలకు కేంద్రం అన్ని విధాలుగా సహకరిస్తోం దని అన్నారు. నిధులు సమకూరుస్తున్నట్లు చెప్పారు. చంద్రబాబు హైదరాబాద్ నగరాన్ని అభివృద్ధి చేయడాన్ని మనం చూశామని, అలాగే అమరావతిని అభివృద్ధి చేయాలనే తపన ప్రధాని మోదీకి కూడా ఉందని అన్నారు. బలహీనవర్గాల రాజధానిగా అమరావతి రూపుదిద్దు కుంటుందన్న నమ్మకం ఉందని ఆర్ కృష్ణయ్య అన్నారు. అమరావతిని ప్రపంచస్థాయి రాజధానిగా చేయడంలో చంద్రబాబు విజయం సాధిస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. ఏపీ రాజధాని అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇవ్వాలని కోరారు. రాజధాని అభివృద్ధిని రాజకీయాలకు అతీతంగా చూడాలని ఆర్ కృష్ణయ్య అన్నారు.

# బాధిత కుటుంబానికి అండగా పెదగాని

అన్వేషనేత్రం ప్రతినిధి

ఈరోజుఅనగా 02/04/2026 రోజున ఇటీవల కాలం వృత్తిరీత్యా తొర్రూరు పెద్ద చెరువులో చేపల వేటకు వెళ్లి ప్రమాదవశాత్తు వలలో చిక్కుకొని మరణించినటువంటి తొర్రూర్ మున్సిపాలిటీ పరిధిలోని 12వ వార్డు వాస్తవ్యులు అలువాల మురళి గారి కుటుంబానికి గత 30 సంవత్సరాలుగా కొనసాగుతున్నటువంటి నిరంతర ప్రక్రియలో భాగంగా వారి తమ్ముడు అయినా అలువాల రాముకి 75 కేజీల బియ్యం ఆర్థిక సహాయం చేసినటువంటి పెద్దలు పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శ్రీ పెదగాని సోమన్న గారు ఈ కార్యక్రమంలో నాయకులు జంజిరాల మనోహర్, మండల శ్రీనివాస్, రమేష్, శ్రీకాంత్, కృష్ణ మరియు ధనుంజయ్ తదితరులు పాల్గొనడం జరిగింది



RNI.No. TELTEL/2010/32434
అన్వేషణనేత్రం
ఎడిటర్: గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

**సంపాదకీయం...**

# సంక్షేమమేది?



అందరి సంక్షేమమే తమ లక్ష్యమంటూ ఊదరగొడుతున్న ప్రభుత్వాలు అధికారం వెలగబెడుతున్నా హాస్టళ్లు, గురుకులాల్లో చదువుకుంటున్న చిన్నారుల ఆలనా పాలనా పట్టించుకునే వారే లేరు. ఏళ్ల తరబడి కలుషిత నీరు తాగుతున్నా, మెనూ ప్రకారం ఆహారం అందకపోయినా, హైకోర్టు చీవాట్లు పెట్టినా పరిస్థితుల్లో మార్పేమీ లేదు. గిరిజన ప్రాంతాల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉంది. పార్వతీపురం జిల్లా కురుపాం గిరిజన బాలికల గురుకుల పాఠశాలలో కలుషిత నీరు తాగడం వల్లే 9, 10 తరగతులు చదువుతున్న ఇద్దరు విద్యార్థినులు ప్రాణాలు కోల్పోయారు. 5వ తరగతి నుంచి ఇంటర్ వరకూ చదువుతున్న 611 మంది బాలికల్లో 140 మంది పచ్చకామెర్లకు గురై జిల్లా కేంద్ర, విశాఖ కెజిహెచ్‌లలో చికిత్స పొందుతున్నారు. సాంఘిక, ఆర్థిక అసమానతల కారణంగా చదువులు అర్ధాంతరంగా ఆగిపోకూడదన్న సంకల్పంతో గురుకులాలు, వసతి గృహాలు ఏర్పాటయ్యాయి. 39 (ఎఫ్) రాజ్యాంగ అధికరణం ప్రకారం ఆరోగ్యకరమైన, గౌరవ ప్రదమైన, స్వేచ్ఛాయుత పరిస్థితుల్లో ఎదిగే అవకాశాలను, సౌకర్యాలను పిల్లలకు అందిస్తూ పీడన, వెలివేతల నుంచి కాపాడటం ప్రభుత్వాల బాధ్యత. 46వ అధికరణం ప్రకారం అణగారిన వర్గాల విద్య ఆర్థిక ప్రయోజనాల పరిరక్షణకు ప్రాధాన్యతనిస్తూ సామాజిక అన్యాయం, దోపిడీల నుంచి వారిని రక్షించాల్సి ఉంది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న కార్పొరేటీకరణ విధానాలతో విద్య అంగడి సరుకుగా మారిపోయింది.

రాజ్యాంగం నిర్దేశించిన కర్తవ్యాల అమలు ఊసేలేదు. సరళీకరణ విధానాలతో కాయకష్టం చేసే వారికి రోజూ పనులు దొరక్కపోవడం, ఉంటుందో, ఊడుతుందో తెలీని ప్రైవేటు ఉద్యోగాలు, తగ్గిపోయిన వేతనాలు, పెరిగిన పని గంటలు, కుటుంబాలు గడవడమే కష్టమవుతున్న పరిస్థితుల్లో రాష్ట్రంలో, పేద, అణగారిన వర్గాలకు చెందిన నాలుగు లక్షల మందికిపైగా పిల్లలకు ప్రభుత్వ పాఠశాలలు, హాస్టళ్లే ఆధారమవుతున్నాయి. వీటికి సకాలంలో నిధులు మంజూరు చేయకపోవడం, డైట్ ఛార్జీలు చెల్లించకపోవడం ఆనవాయితీగా మారిపోయింది. మెనూ అమలు ఊసేలేదు. పౌష్టికాహారం అందకపోవడం, తాగునీటి కాలుష్యం, అపరిశుభ్రత తదితర కారణాల వల్ల తరచూ అతిసార, విషజ్వరాలు, మలేరియా, టైఫాయిడ్ తదితర వ్యాధులకు గురవడం సర్వసాధారణమైపోయింది. విద్యార్థినులపై లైంగిక వేధింపుల ఘటనలు సైతం వెలుగుచూస్తున్నాయి. రాష్ట్రంలో 65 హాస్టళ్లను పరిశీలించిన డిస్ట్రిక్ట్ లీగల్ సర్వీసెస్ అథారిటీ%ొ% నర్సీపట్నంలోని ఓ బాలికల హాస్టల్‌లో 228 మంది విద్యార్థినులకు ఒకే మరుగుదొడ్డి, ఒకటే బాత్రూమ్ ఉండటంసహా అనేక సమస్యలను వెలుగులోకి తీసుకొచ్చింది. ఈ పరిస్థితిపై చలించిపోయిన రాష్ట్ర హైకోర్టు విద్యార్థులకు తగినన్ని మరుగుదొడ్లు, బాత్రూమ్‌లు లేకపోతే ఎలా? అవసాన దశలో ఉన్న హాస్టల్ భవనాలు కూలిపోతే విద్యార్థులేం కావాలి? మన ఇంట్లో పిల్లల్ని నేలపై పడుకోబెడతామా? ఏటా ప్రభుత్వం కేటాయించే కోట్ల రూపాయలు ఏమవుతున్నాయి? నేషనల్ కమిషన్ ఫర్ ప్రొటెక్షన్ ఆఫ్ చైల్డ్ రైట్స్ (ఎన్‌సిపిసిఆర్) గైడ్‌లైన్స్ ప్రకారం మౌలిక వసతులన్నీ ప్రభుత్వమే కల్పించాలంటూ గత జులైలో ప్రభుత్వాన్ని ఆదేశించింది. జిల్లా సీనియర్ అధికారులు నెలవారీగా తనిఖీలు చేయాలని, ఆ నివేదికలను తెప్పించుకోవాలని సిఎస్‌లను ఆదేశించింది. హైకోర్టు ఇంత ఆగ్రహం వ్యక్తం చేసినా%ొ% పరిస్థితుల్లో ఏమాత్రం చలనం లేదనడానికి కురుపాం హాస్టల్ దుస్థితే నిదర్శనం. ఆర్‌ఒ సిస్టమ్ పాడై, పరిశుభ్రమైన తాగునీరు అందుబాట్లో లేకపోవడమే విద్యార్థినుల ప్రాణాంతక పచ్చకామెర్లకు ప్రధాన కారణం. పిల్లలు ఇళ్ల వద్ద చనిపోతే ప్రభుత్వానిది బాధ్యతెలా అవుతుందని, నష్టపరిహారం ఎలా ఇస్తామని పార్వతీపురం జిల్లాకే చెందిన రాష్ట్ర గిరిజన సంక్షేమశాఖ మంత్రి వ్యాఖ్యానించారు. కనీస మౌలిక వసతులు కల్పించడంలో వైఫల్యం వల్లే వారు హాస్టళ్లలో తీవ్ర అనారోగ్యానికి గురయ్యారన్న విషయాన్ని పట్టించుకోకపోవడం సమంజసమా? బాధితులు, గిరిజనులు డిమాండ్ చేసిన విధంగా%ొ% మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించడంతోపాటు సమస్యలను పరిష్కరించాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే. పిల్లలకు, వృద్ధులకు హాస్టళ్లు ఉన్నాయని, పశువులకు కూడా హాస్టళ్లు ఏర్పాటు చేస్తామని ఇటీవల సిఎం ప్రకటించారు. పిల్లల హాస్టళ్లను మెరుగుచేయకుండా పశువులకు హాస్టల్ అనడం సమంజసమేనా? కేరళలో సాంఘిక సంక్షేమ హాస్టళ్లలో, ప్రభుత్వ పాఠశాలల్లో చేరే విద్యార్థుల సంఖ్య ప్రతి సంవత్సరం పెరగడానికి అక్కడి ప్రభుత్వ విధానాలే కారణమని గుర్తించాలి. ఆర్థిక, సామాజిక అంతరాలకు అతీతంగా నవతరాన్ని తీర్చిదిద్దాలన్న సంకల్పంతో ప్రభుత్వాలు కార్యాచరణలోకి దిగితేనే ఇటువంటి పరిస్థితులను అధిగమించగలం. ఆ దిశగా ప్రజలంతా సంఘటితంగా ఒత్తిడి తేవాలి.

# వేసవిలో భారత ఎగుమతులకు దెబ్బే

## అమెరికాతో డీల్ కుదరకపోతే కష్టమే

## 50 శాతం సుంకాలు చాలా భారమే

## నీతి అయోగ్ సిఇఒ సుబ్రమణ్యం వెల్లడి

**న్యూఢిల్లీ :**

భారత్, అమెరికా మధ్య త్వరలో వాణిజ్య ఒప్పందం కుదరకపోతే వచ్చే వేసవి కాలంలో దేశీయ ఎగుమతులు భారీగా ప్రభావితం కావొచ్చని నీతి ఆయోగ్ సిఇఒ సుబ్రమణ్యం అన్నారు. వచ్చే నవంబర్ నాటికి ఒప్పందం కుదిరితే అంతరాయాలు తప్పవచ్చని ఆశాభావం వ్యక్తం చేశారు. "రెండు దేశాలూ వాణిజ్య ఒప్పందం కోసం కట్టుబడి ఉన్నాయి. గత నెలలో చర్చలు జరిగాయి. రెండు వైపులా ఆశలు ఇంకా సజీవంగానే ఉన్నాయి." అని సుబ్రమణ్యం అన్నారు. సోమవారం న్యూఢిల్లీలో ఆయన 'ట్రేడ్ వాచ్ క్వార్టర్లీ' రిపోర్ట్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా సుబ్రమణ్యం మాట్లాడుతూ.. క్రిస్మస్ వరకు ఎగుమతులపై ప్రభావం ఉండకపోవచ్చని అశాభావం వ్యక్తం చేశారు. కానీ వాణిజ్య ఒప్పందం జరగకపోతే వేసవి కాలంలో సమస్యలు తలెత్తవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు.

మనం క్లిష్ట సమస్యలో ఉన్నామన్నారు. 50 శాతం సుంకాలు చాలా భారమన్నారు. నవంబర్ నాటికి ఒప్పందం జరిగితే అంతరాయాలు ఉండకపోవచ్చన్నారు. భారత్, అమెరికా ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పంద చర్చలు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం అమెరికా విధించిన 50 శాతం సుంకాలను తొలగించడంపై దృష్టి సారించాయన్నారు. భారత్ తన వాణిజ్య లోటును నిర్వహించుకునే స్థాయిలో ఉన్నప్పటికీ.. అసమతుల్యంగా ఉందని అన్నారు. భారత్ తన సుంకాలు, సుంకేతర అడ్డంకులను తగ్గించాలని పేర్కొన్నారు. విదేశాల కోసం మార్కెట్‌లను తెరవడం ద్వారా తయారీ రంగంలో పోటీతత్వాన్ని పెంచాలన్నారు. భారత్ ఏ రంగాన్ని రక్షించకూడదని తన భావన అని అన్నారు. చైనాతో సహా ఆసియా దేశాలకు విక్రయించడానికి భారత్ పోటీతత్వంతో ఉండాలన్నారు. చైనా నుంచి పెట్టుబడులపై నిషేధాన్ని ఎత్తివేయడం గురించి అడిగిన ప్రశ్నకు సుబ్రమణ్యం సమాధానం ఇస్తూ.. చైనా భారత్‌కు దిగుమతుల విషయంలో ప్రధాన సరఫరాదారుగా ఉందని ఆయన చెప్పారు. 15 ట్రిలియన్ డాలర్ల చైనా ఆర్థిక వ్యవస్థను విస్మరించలేమని ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వాలు కొత్త తయారీ విధానం క్లస్టర్‌లు, ప్రపంచ స్థాయి ఇకోసిస్టమ్‌పై దృష్టి పెట్టాలన్నారు. తయారీని వైవిధ్యపర్చాల్సిన అవసరం ఉందన్నారు.




# అధిక సుంకాలతో భారత వృద్ధి తగ్గొచ్చు

## చైనా జిడిపి పెరగొచ్చు

## ప్రపంచ బ్యాంక్ అంచనా

**వాషింగ్టన్ :**

అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన అధిక సుంకాలు భారత వృద్ధిని దెబ్బతీయొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. అధిక టారిఫ్‌లతో భారత ఎగుమతులు తగ్గొచ్చని.. దీంతో వచ్చే ఏడాది దక్షిణాసియా వృద్ధి రేటు మందగించవచ్చని తెలిపింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం 2025-26లో భారత జిడిపి 6.5 శాతంగా ఉండొచ్చని.. వచ్చే ఏడాది 2026-27లో 6.3 శాతానికి తగ్గొచ్చని విశ్లేషించింది. భారత్ నుంచి చేసుకునే దిగుమతులపై ట్రంప్ 50 శాతం సుంకాలు విధించడంతో 50 బిలియన్ డాలర్ల విలువ చేసే ఉత్పత్తులపై ప్రభావం పడనుందని గుర్తు చేసింది. 2025-26లో దక్షిణాసియా వృద్ధి 6.6 శాతంగా ఉండొచ్చని.. తదుపరి 2026-27లో 5.8 శాతానికి తగ్గొచ్చని ప్రపంచ బ్యాంక్ అంచనా వేసింది. బలహీన ఎగుమతులతో భారత్, మాల్దీవులు, నేపాల్ విదేశీ మారకం ఒత్తిడికి గురి కావొచ్చని తెలిపింది. ఇదే సమయంలో చైనా జిడిపి మాత్రం పెరగొచ్చని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది. ప్రస్తుత 2025-26లో చైనా జిడిపి 4 శాతంగా ఉండొచ్చని ఏప్రిల్‌లో వేసిన అంచనాలను ఏకంగా 4.8 శాతానికి పెంచింది. అమెరికా టారిఫ్‌ల పెంపు ఉన్నప్పటికీ చైనాలో దేశీయ డిమాండ్ పెరగడమే ప్రధాన కారణమని పేర్కొంది. సుంకాల ప్రభావాన్ని తగ్గించేందుకు భారత ప్రభుత్వం వినియోగ వస్తువులు, ఆటోమొబైల్స్‌పై పన్ను తగ్గింపులను ప్రకటించినప్పటికీ, అలాగే మౌలిక సదుపాయాల వ్యయాన్ని పెంచుతోన్నట్లు ప్రకటించినప్పటికీ



ప్రపంచ బ్యాంక్ భారత జిడిపి అంచనాలకు కోత పెట్టడం విశేషం. కరోనా తర్వాత రికవరీ ఊపు తగ్గడం, కొత్త వాణిజ్య అడ్డంకులతో దక్షిణాసియా వృద్ధి మందగిస్తుందని ప్రపంచ బ్యాంక్ పేర్కొంది.

RNI.No. TELTEL/2010/32434
అన్వేషణనేత్రం
ఎడిటర్: గోళ్ల రమేష్ తెలుగు దినపత్రిక

**బిజినెస్..**

# రైలు టికెట్ ప్రయాణ తేదీని మార్చుకోవచ్చు

**ఇంటర్నెట్:**

రైలు టికెట్ తేదీ మార్పుపై భారత రైల్వే నిర్ణయం తీసుకుంది. ప్రయాణికుడు తన ప్రయాణ తేదీని మార్చడానికి అవకాశం లేదు. అలా చేయాలంటే టికెట్ ను రద్దు చేసుకొని, కొత్త టికెట్ తీసుకోవాల్సిందే. ప్రస్తుత నిబంధన ప్రకారం, రైలు బయలుదేరడానికి 48 నుంచి 12 గంటల ముందు బుకింగ్ టికెట్‌ను రద్దు చేసుకుంటే ఛార్జీల నుంచి 25 తగ్గించి, మిగిలిన డబ్బు రీఫండ్ చేస్తారు. 12 గంటల నుంచి 4 గంటల ముందు ఛార్జ్ మరింత పెరుగుతుంది. రిజర్వేషన్ చార్ట్ వచ్చిన తర్వాత ఎలాంటి డబ్బు తిరిగి చెల్లించబడదు. ఇది ప్రయాణికులకు ఇబ్బందులకు గురిచేస్తుంది. దీనిని దృష్టిలో పెట్టుకొని భారత రైల్వే రైల్ టికెట్ తేదీ మార్పు చేసుకునే అవకాశం కల్పించనుంది. కొత్త విధానం జనవరి నుంచి అమలులోకి రాబోతున్నది. జనవరి నుంచి, ప్రయాణికులు తమకు కన్ఫామ్ అయిన రైలు టికెట్ ప్రయాణ తేదీని ఎలాంటి రుసుము లేకుండా ఆన్‌లైన్‌లో మార్చుకోవచ్చని కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ చెప్పారు. అయితే, మార్చుకోవాల్సిన తేదీలో సీట్లు ఖాళీగా ఉంటేనే మార్పు సాధ్యపడుతుంది. కొత్త టికెట్ ధర ఎక్కువైతే, ఆ వ్యత్యాసాన్ని ప్రయాణికుడు భరించాల్సిందే.

# బంగారం ..రూ.1.30 లక్షలు ఒకే రోజు రూ.9,700 పెరుగుదల

న్యూఢిల్లీ : బంగారం ధరలు భగ్గుమంటున్నాయి. ఒక్క పూటలోనే రూ.9,700 పెరిగి.. మధ్యతరగతి ప్రజలు కూడా కొనలేని స్థాయికి ఎగిసింది. సోమవారం న్యూఢిల్లీ బులియన్ మార్కెట్‌లో 10 గ్రాముల బంగారంపై రూ.9,700 ప్రియమై సరికొత్త రికార్డ్ స్థాయి రూ.1,30,300కు చేరింది. అంతర్జాతీయ ద్రవ్య మార్కెట్‌లో రూపాయి మారకం విలువ పడిపోవడానికి తోడు భౌగోళిక ఆందోళనలు, అమెరికా ప్రభుత్వ షట్‌డౌన్ నేపథ్యంలో బంగారం సురక్షిత పెట్టుబడిగా పరిగణించడంతో ఈ లోహం ధర పెరుగుతోందని బులియన్ నిపుణులు పేర్కొంటున్నారు. ఆలిండియా సరాఫా అసోసియేషన్ ప్రకారం.. శుక్రవారం 99.9 శాతం స్వచ్ఛత కలిగిన 10 గ్రాముల బంగారం ధర రూ.1,20,600 వద్ద ముగిసింది. సోమవారం స్థానిక బులియన్ మార్కెట్లో 99.5 శాతం స్వచ్ఛత కలిగిన బంగారం ధర రూ.2,700 పెరిగి రూ.1,22,700 (అన్ని పన్నులతో సహా) రికార్డు స్థాయిని తాకింది. గత మార్కెట్ సెషన్‌లో ఇది రూ.1,20,000 వద్ద ముగిసింది. అమెరికన్ డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ పతనం కావడం బంగారం ధరల పెరుగుదలకు ప్రధాన కారణమని మార్కెట్ వర్గాలు తెలిపాయి.

# నేకిరేకల్ నియోజకవర్గం ఉరుమడ్ల గ్రామములో ప్రజా పాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమం






**నకిరేకల్ నియోజకవర్గం:-**

చిట్యాల మండలం ఉరుమడ్ల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం (గూజా) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శాసన మండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు, ప్రభుత్వ విప్., నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు ప్రారంభించారు.. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులు పండించిన ధాన్యాన్ని ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసి వారికి న్యాయం చేయడానికి ఇలాంటి కొనుగోలు కేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. రైతులు ఎటువంటి ఇబ్బందులు లేకుండా తమ ధాన్యాన్ని అమ్ముకునేలా అన్ని సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ శ్రీ చంద్రశేఖర్ గారు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, రైతులు మరియు ఇతరులు పాల్గొన్నారు.






**నకిరేకల్ నియెజకవర్గం :-**

1).కేతేపల్లి మండలం కొండకిందిగూడెం గ్రామానికి చెందిన నర్సింగ్ నారయణ కుమారుడి వివాహానికి హజరై నూతన వధూవరులను ఆశీర్వదించి.,2).నకిరేకల్ పట్టణానికి చెందిన మిర్యాల చల్మారాజు కుమార్తె వివాహానికి హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించి.,3).నార్కెట్‌పల్లి మండలం తొండలవాయ్ గ్రామ మాజీ సర్పంచ్ బింగి కొండయ్య కుమారుడి వివాహానికి హజరై నూతన వధూవరులను ఆశీర్వదించిన.,ప్రభుత్వ విప్ నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు






**అన్వేషనేత్రం ప్రతినిధి**



గ్రామ సమగ్ర అభివృద్దే నా ప్రధాన ధ్యేయంమండలి చైర్మన్ గుత్తా సుఖేశీదర్ రెడ్డి గారు ఈ రోజు ఉరుమడ్ల గ్రామంలో సర్పంచ్ శ్రీ భాను శ్రీ భిక్షం గారి అధ్యక్షతన నిర్వహించిన గ్రామ సభలో ముఖ్య అతిథులు గా పాల్గొన్న గౌరవ పెద్దలు తెలంగాణ రాష్ట్ర శాసనమండలి చైర్మన్
శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు ప్రభుత్వ విప్, నకిరేకల్ ఎమ్మెల్యే శ్రీ వేముల వీరేశం గారు జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ గారులి ఈ సందర్భంగా శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారు మాట్లాడుతూ: - రాష్ట్రవ్యాప్తంగా కొత్త పింఛన్లు మంజూరు, ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం కొనసాగుతున్నట్లు తెలిపారు. ఉరుమడ్ల గ్రామంలో కమ్యూనిటీ హాల్ నిర్మాణం,జజ రోడ్లు, చెరువు కట్ట పనులు,అంగన్వాడీ కేంద్రాలు,స్కూల్ ప్రహరీ, పూర్తి చేసినట్లు పేర్కొన్నారు.
ఎన్నికల సమయంలో మాత్రమే రాజకీయాలు ఉండాలని, మిగతా సమయాల్లో అభివృద్దే ప్రధాన లక్ష్యంగా పని చేస్తున్నామని అన్నారు.ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే వీరేశం గారు మాట్లాడుతూ ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్న ప్రజలకు ఇచ్చిన హామీ మేరకు రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు, ఉచిత బస్సు ప్రయాణం, ఉచిత విద్యుత్ వంటి పథకాలు రాష్ట్ర ప్రభుత్వం అందజేచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమమం లో సర్పంచ్ శ్రీ సాగర్ల భాను శ్రీ భిక్షం గారు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సందేశాన్ని చదివి వినిపించారు. ఉప సర్పంచ్ ఉయ్యాల నరేష్, ావీజ డైరెక్టర్ కోనేటి యాదగిరి, గ్రామ శాఖ అధ్యక్షులు చెరుకు సైదులు, మాజీ వీుజ పోలగోని స్వామి ,సీనియర్ నాయకులు పల్లపు బుద్ధుడు, చిట్యాల మండల సోషల్ మీడియా ఇంచార్జీ పట్ల జనార్ధన్ ,వార్డు సభ్యులు, పంచాయతీ కార్యదర్శి ఉపేందర్ గారు,మహిళా సంఘం అధ్యక్షులు, సభ్యులు ,ాూూ లు, ఆశావర్కర్లు, గ్రామ ప్రజలు, మహిళలు, యువకులు, పార్టీ నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.ప్రజా పాలన విజవంతం చేసినారు.

## "ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" రోజుల కార్యాచరణ




**చెరువుగట్టు:-అన్వేషనేత్రం ప్రతినిధి**

"ప్రజా పాలన-ప్రగతి ప్రణాళిక" 99 రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా ఈరోజు చెరువుగట్టు గ్రామంలో సర్పంచ్ నేతకాని కృష్ణయ్య గారి ఆధ్వర్యంలో గ్రామసభ ఏర్పాటు చేయడం..ఈ గ్రామసభలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన దగ్గర నుండి చెరువుగట్టు గ్రామానికి వివిధ పథకాల ధ్వారా లబ్ది పొందిన వారి వివరాలు మరియు గ్రామంలో జరిగిన అభివృద్ధి,జరగబోయే అభివృద్ధి మరియు కొత్త పథకాల గురించి సర్పంచ్ గారు,ఎంపీఓ సుధాకర్ గారు,వివిధ డిపార్ట్మెంట్ సంబందించిన అధికారులు గ్రామ ప్రజలకు తెలియజేయండి జరిగింది..అంతే కాకుండా చేర్వగట్టు గ్రామ అభివృద్ధి కోసం హర్నిశలు శ్రమించి ప్రజలతో మమేకమై చేస్తూ ఎలాంటి సమస్యలున్న ఎమ్మెల్యే వేముల వీరేశం గారి సహకారంతో మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డి సహకారంతో పర్యకరిస్తానని గ్రామ సర్పంచు నేతకానీ కృష్ణయ్య చెలియజేసినారు ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా వచ్చిన ఎంపీఓ సుధాకర్ గారు,మాజీ చైర్మన్ రెగట్టే రాజశేఖర్ రెడ్డి గారు,పిఏసిఎస్ డైరెక్టర్ గడుసు శశిధర్ రెడ్డి గారు,జిల్లా కాంగ్రెస్ పార్టీ నాయకులు రెగట్టే నవీన్ రెడ్డి గారు గ్రామ పంచాయతీ పాలక వర్గ సభ్యులు,గ్రామ కార్యదర్శి రవీందర్ రెడ్డి,గ్రామ పెద్దలు,నాయకులు,యువకులు,ప్రజలు తదితరులు పాల్గొన్నారు..












# ఎమ్మెల్యే చొరవతో బమ్మెర పోతన స్మారక నిర్మాణ ప్రాజెక్టులో కదలిక








పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని రెడ్డి గారి చొరవతో బమ్మెర పోతన స్మారక నిర్మాణ పనుల్లో కదలిక వచ్చింది. క్షేత్ర సంస్థ ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్స్ బృందం బమ్మెరలో పర్యటించి సమగ్ర సర్వే నిర్వహించారు. నిర్మాణంలో మిగిలిన పనుల వివరాలను సేకరించి, బ్యాలెన్స్ వర్క్ అంచనాలతో పాటు పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసే ప్రక్రియను ప్రారంభించారు.

బమ్మెర పోతన స్మారక నిర్మాణ పనులకు మళ్లీ ఊపిరి పోసే దిశగా కీలక చర్యలు ప్రారంభమయ్యాయి. బమ్మెర గ్రామంలోని స్మారక నిర్మాణ ప్రదేశంలో ఆగిపోయిన పనులను తిరిగి ప్రారంభించేందుకు గౌరవనీయులైన పాలకుర్తి ఎమ్మెల్యే శ్రీమతి యశస్విని రెడ్డి గారి చొరవతో పాటు బమ్మెర పోతన స్పెషల్ కమిటీ ఆదేశాల మేరకు చర్యలు చేపట్టారు. హైదరాబాద్‌కు చెందిన ఖంష్ట్రవేఃథు జశీఅంబశ్రీఖఀం సంస్థ ఇంజినీర్లు, ఆర్కిటెక్ట్స్ బృందం బమ్మెర గ్రామంలో పర్యటించి ప్రాజెక్టులో ఇంకా పూర్తికాని పనులపై సమగ్ర సర్వే నిర్వహించారు. నిర్మాణంలో మిగిలిన పనుల వివరాలను సేకరించి, బ్యాలెన్స్ వర్క్ అంచనాలతో పాటు పూర్తి స్థాయి నివేదికను సిద్ధం చేసే ప్రక్రియను ప్రారంభించారు. ఈ నివేదిక సిద్ధమైన అనంతరం, ఎస్పీవీ కమిటీ నిర్ణయం మేరకు త్వరలోనే నిర్మాణ పనులను పునఃప్రారంభించే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఈ విషయాన్ని డీఈఈ, ఆర్‌డబీ పాలకుర్తి ఎన్. సతీష్ కుమార్ వెల్లడించారు. ఆయన పరిధిలో పాలకుర్తి, కొడకండ్ల, దేవరుప్పుల, ఘనపూర్, జఫర్‌గఢ్, చిల్పూర్ మండలాలు ఉన్నట్లు తెలిపారు.





నేడు నల్గొండ పట్టణంలో శ్రీ వెంకటరమణ గ్రాండ్ హోటల్ ప్రారంభోత్సవ కార్యక్రమానికి వచ్చిన త్రిపుర గవర్నర్ శ్రీ ఎన్ ఇంద్రసేనా రెడ్డి గారు, అనంతరం నల్గొండ లోని శాసనమండలి చైర్మన్ శ్రీ గుత్తా సుఖేందర్ రెడ్డి గారి క్యాంపు కార్యాలయానికి రావడం జరిగింది ఆయనను అలింగణం చేసుకొని గతములో వారికీ ఉన్న అనుబంధంతో వ్యక్తి గత విషయాలు ఆరోగ్యవిషయాలు మాట్లాడు కోవడం జరిగింది.



ఈరోజు వేంబావి గ్రామంలో జరిగిన గ్రామ సభ లో మాట్లాడుతున్న కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు అద్దెల లింగా రెడ్డి రెడ్డి గారు వారు మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన తరువాత తెలంగాణ చాలా అభివృద్ధి చెందు తున్నదని అని ప్రతి పేద వాడికి పథకాలు అందుతున్నాయని అని మాట్లాడారు మన గ్రామంలో నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం గారు ఎమ్మెల్యే ఐన తరువాత ఎన్నడూ లేని విధంగానకిరేకల్ నియోజకవర్గం లో అభివద్ధి జరుగుతుంది అని అన్నారు మనము ఎమ్మెల్యే గారికి తోడుగా ఉంటు మన గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసుకుందాం అని చెప్పారు ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు యువకులు పాల్గొన్నారు.

# సాయి నైసా మల్టీ స్పెషల్ హాస్పిటల్ ప్రారంభం

## పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో మెరుగైన వైద్య సేవలు -చైర్మన్ రాపోల దత్తా గణేశం

**నల్గొండ,అన్వేషనేత్ర ఏప్రిల్ 2:**

నలగొండ పట్టణంలో గురువారం సాయి నైసర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ను ప్రారంభించిన హాస్పిటల్ చైర్మన్ రాపోల దత్తా గణేశం.అనంతరం చైర్మన్ మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా కాంగ్రెస్ పార్టీలో ప్రజాసేవ చేస్తూ...మారుమూల గ్రామాల నుండి ప్రజలు వైద్య సేవలకు పట్టణానికి వస్తూ అనేక రకాలుగా ఆర్థికంగా హాస్పిటల్ వైద్య ఖర్చులు లేక ఇబ్బందులు పడుతున్న ప్రజలను దృష్టిలో ఉంచుకొని... పేద ప్రజలకు తక్కువ ఖర్చుతో వైద్య సేవలు అందించాలనే సేవా దృక్పథంతో తన కుమారుడిని విదేశాలలో ఉన్నత డాక్టర్ చదువులు చదివించి నేడు నల్గొండ పట్టణంలో హాస్పిటల్ ప్రారంభించడం జరిగింది.నల్లగొండ జిల్లా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించే లక్ష్యంగా తక్కువ ఖర్చుతో సాయి నైసా మల్టీ సోషల్ హాస్పిటల్ యజమాన్యం వైద్యం అందిస్తుందని అన్నారు.నల్గొండ జిల్లా ప్రజలు సుదూర నగరాలకు వెళ్లకుండా హైదరాబాద్ కార్పొరేట్ హాస్పిటల్ ధీటుగా అన్ని రకాల వైద్య సేవలు సాయి నైసా మల్టీస్ ఆస్పత్రిలో అందుబాటులో ఉన్నాయని ప్రజల సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ మహమ్మద్ ఇంతియాజ్ పాల్గొన్న సందర్భంగా హాస్పిటల్ చైర్మెన్ కుమారులు మెమంటో ఇచ్చి శాల్వకప్పి సత్కారించిన్నారు హాస్పిటల్ యజమాన్యానికి,చైర్మన్ గారికి మహామ్మద్ ఇంతియాజ్ శుభాకాంక్షలు తెలిపారు.






సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ గారు తెలంగాణ చరిత్రలో అణగారిన వర్గాల కోసం పోరాడిన మహా వీరుడిగా చిరస్మరణీయులు. సాధారణ కుటుంబంలో జన్మించిన ఆయన, తన ధైర్యం, పట్టుదలతో సమాజంలో ఉన్న అన్యాయాలకు ఎదురు నిలిచారు. 17వ శతాబ్దంలో స్థానిక దోపిడీదారులు మరియు అధికారం దుర్వినియోగం చేస్తున్న శక్తులపై తిరుగుబాటు చేసి, ప్రజల కోసం స్వతంత్ర పాలనను స్థాపించారు. ఆయన నిర్మించిన కోటలు---ప్రత్యేకంగా ఖిలా షాపూర్---ఆయన వీరత్వానికి అజరామరమైన నిదర్శనాలు. పాపన్న గారి పాలనలో సామాన్య ప్రజలకు ప్రాధాన్యత ఇచ్చి, కుల, వర్గ వివక్షలకు అతీతంగా సమానత్వాన్ని నెలకొల్పారు. అందుకే ఆయనను "మొదటి బహుజన రాజ్య స్థాపకుడు"గా గౌరవంగా స్మరించుకుంటారు. ఈ రోజు కూడా ఆయన స్ఫూర్తి తెలంగాణ ప్రజలను న్యాయం, సమానత్వం కోసం పోరాడే దిశగా నడిపిస్తోంది.

మీ
కందుకూరి అనూష కృష్ణ
సంగారెడ్డి నియోజకవర్గ ప్రతినిధి



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఈ రోజు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని 12 వ డివిజన్ దేశాయి పేటలో నిర్వహించగా ముఖ్య అతిథులుగా గౌ "అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ గారు మరియు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్యాశారద గారు పాల్గొన్నారు. అనంతరం ప్రెస్ మీట్ లో మంత్రివర్యులు కొండా సురేఖ గారు



తెలంగాణ ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజా పాలన – ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఈ రోజు వరంగల్ తూర్పు నియోజకవర్గంలోని దేశాయి పేటలో నిర్వహించగా
ముఖ్య అతిథులుగా గౌ "అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రివర్యులు శ్రీమతి కొండా సురేఖ గారు మరియు వరంగల్ జిల్లా కలెక్టర్ సత్య శారద గారు విచ్చేసిన సందర్భంగా వారికి పూలే కుండీతో స్వాగతం పలికిన వరంగల్ జిల్లా యువజన కాంగ్రెస్ సోషల్ మీడియా కోఆర్డినేటర్ దొంతుల రాజేష్ నేత
లిజై! కొండా
లిజై! కాంగ్రెస్ లి







అన్వేషణ నేత్రం
RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గొల్ల రమేష్ | తెలుగు దినపత్రిక

## ఆట



# షాహీన్ అఫ్రిదిపై భారీ జరిమానా

పాకిస్థాన్ సూపర్ లీగ్ ఫ్రాంచైజీ లాహోర్ ఖలందర్స్ తమ స్టార్ ఫాస్ట్ బౌలర్ షాహీన్ అఫ్రిదిపై భారీ జరిమానా విధించింది. భద్రతా నిబంధనలను ఉల్లంఘించి నలుగురు వ్యక్తులను జట్టు బస చేస్తున్న హోటల్ గదిలోకి బలవంతంగా తీసుకెళ్లినట్లు ఆరోపణలు రావడంతో ఏకంగా రూ.10 లక్షలు (పాక్ కరెన్సీలో) ఫైన్ వేసింది. జట్టులో క్రమశిక్షణను కాపాడటం, జవాబుదారీతనాన్ని నిర్ధారించే క్రమంలోనే ఈ నిర్ణయం తీసుకున్నట్లు ఫ్రాంచైజీ ఒక ప్రకటనలో స్పష్టం చేసింది. పంజాబ్ పోలీసులు పీఎస్ఎల్ సీఈఓ సల్మాన్ నసీర్ కు రాసిన లేఖలో అఫ్రిదితో పాటు ఆ జట్టు ఆటగాడు సికిందర్ రజాపై తీవ్ర ఆరోపణలు చేసినట్లు న్యూస్18 ఇంగ్లీష్ పేర్కొంది. నలుగురు సందర్శకులను హోటల్ లోకి అనుమతించాలని వీరు కోరగా భద్రతా సిబ్బంది నిరాకరించారు. అయినా సరే వారు ఆ నలుగురిని గదిలోకి తీసుకెళ్లారని, దాదాపు మూడు గంటల పాటు అక్కడే ఉన్నారని పోలీసులు పేర్కొన్నారు. ఈ ఏడాది జరిగిన పీఎస్ఎల్ సీజన్ లో లాహోర్ జట్టు పేలవ ప్రదర్శనతో టోర్నీ నుంచి నిష్క్రమించిన విషయం అందరికీ తెలిసిందే. వివాదాలు కూడా ఈ జట్టును వెంటాడుతున్నాయి. ఈ ఘటనపై లాహోర్ ఖలందర్స్ యాజమాన్యం స్పందిస్తూ, క్రమశిక్షణతో జవాబుదారీతనం ప్రదర్శించే ఉద్దేశంతోనే షాహీన్ షా అఫ్రిదిపై పది లక్షల రూపాయల జరిమానాను స్వచ్ఛందంగా విధించినట్లు వెల్లడించింది. ఈ విషయమై పాకిస్థాన్ క్రికెట్ బోర్డు (పీసీబీ) కు పూర్తి వివరాలతో కూడిన వివరణను అధికారికంగా పంపినట్లు తెలియజేసింది. ఆటగాళ్లు, అధికారులు, ప్రేక్షకుల భద్రతను నిర్ధారించడంలో భద్రతా సిబ్బంది చేస్తున్న కృషిని ఫ్రాంచైజీ మనస్ఫూర్తిగా ప్రశంసించింది. నిబంధనలను ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించాలనే ఆలోచన ఆటగాళ్లకు లేదని, కేవలం ఒక చిన్న అపార్థం వల్లే ఈ సమస్య తలెత్తిందని ఫ్రాంచైజీ యాజమాన్యం వివరించింది. అయితే భద్రతా ప్రోటోకాల్స్ పట్ల తమకు పూర్తి గౌరవం ఉందని వారు పునరుద్ఘాటించారు. మరోవైపు భద్రతా ఉల్లంఘన ఘటనకు తాను పూర్తి బాధ్యత వహిస్తున్నానని సికిందర్ రజా స్పష్టం చేశాడు. ఈ విషయంలో ఎవరినీ షాహీన్ బలవంతపెట్టలేదని తెలిపాడు. తన స్నేహితులు, కుటుంబ సభ్యులు వచ్చారని, వారిని గది వద్దకు తీసుకురావాలని తాను కోరినందుకే షాహీన్ సహాయం చేశాడని రజా చెప్పుకొచ్చాడు. హోటల్ నియమావళి గురించి తనకు పూర్తిగా తెలియదని, షాహీన్ కు కూడా ఈ విషయంపై పెద్దగా అవగాహన లేదని అన్నాడు.

# సురేశ్ రైనా రికార్డు బద్దలు

ఐపీఎల్ 2026 సీజన్‌ను రాజస్థాన్ రాయల్స్ యువ సంచలనం, 15 ఏళ్ల ఓపెనర్ వైభవ్ సూర్యవంశీ అదరగొట్టే ప్రదర్శనతో ప్రారంభించాడు. సోమవారం గువాహటిలోని బర్సపారా స్టేడియం వేదికగా చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్కే)తో జరిగిన మ్యాచ్‌లో ఆకాశమే హద్దుగా చెలరేగి కేవలం 15 బంతుల్లోనే హాఫ్ సెంచరీ సాధించాడు. 128 పరుగుల స్వల్ప లక్ష్య ఛేదనలో బరిలోకి దిగిన అతనికి ఖాతా తెరవకముందే అదృష్టం కలిసొచ్చింది. సీఎస్కే ఫీల్డర్ కార్తీక్ శర్మ క్యాచ్ డ్రాప్ చేయడంతో బతికిపోయిన వైభవ్.. ఆ తర్వాత చెన్నై బౌలర్లపై నిర్దాక్షిణ్యంగా విరుచుకుపడ్డాడు. క్రీజులో ఉన్నంతసేపు బౌండరీలతో హోరెత్తిస్తూ 17 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్ల సాయంతో 52 పరుగులు చేసి అన్షుల్ కాంబోజ్ బౌలింగ్‌లో అవుట్‌గా వెనుదిరిగాడు. ఈ తుఫాన్ ఇన్నింగ్స్‌తో చెన్నై జట్టును మ్యాచ్‌పై ఆశలు వదులుకునేలా చేశాడు. ఈ యువ కెరటం గత ఏడాది ఢిల్లీ పిచ్‌పై సీఎస్కే పైనే 33 బంతుల్లో 57 పరుగులు చేసి తన పరిణతిని చాటుకోగా, ఇప్పుడు విధ్వంసకర ఇన్నింగ్స్‌తో తన విశ్వరూపాన్ని పరిచయం చేశాడు. ఈ అద్భుతమైన ఇన్నింగ్స్‌తో ఐపీఎల్ చరిత్రలో అత్యంత వేగంగా అర్ధ శతకం సాధించిన మూడో బ్యాటర్‌గా వైభవ్ రికార్డు సృష్టించాడు. ఈ జాబితాలో యూసఫ్ పఠాన్, సునీల్ నరైన్, నికోలస్ పూరన్, జేక్ ఫ్రేజర్-మెక్‌గుర్క్‌లతో కలిసి అతడు మూడో స్థానాన్ని పంచుకున్నాడు. ఐపీఎల్‌లో యశస్వి జైస్వాల్ (13 బంతుల్లో), కేఎల్ రాహుల్, పాట్ కమిన్స్, రొమారియో షెపర్డ్ (14 బంతుల్లో) మాత్రమే వైభవ్ కంటే ముందున్నారు. ఇక రాజస్థాన్ రాయల్స్ తరఫున ఇది రెండో అత్యంత వేగవంతమైన హాఫ్ సెంచరీ కావడం విశేషం.గత ఏడాది జైపూర్‌లో గుజరాత్ టైటాన్స్‌పై 17 బంతుల్లోనే ఫిఫ్టీ (ఆ మ్యాచ్‌లో 35 బంతుల్లోనే సెంచరీ సాధించాడు) చేసిన తన పాత రికార్డును అతడు ఇప్పుడు తిరగరాశాడు. సురేశ్ రైనా, ఇషాన్ కిషన్, అభిషేక్ శర్మ, ట్రావిస్ హెడ్ లాంటి స్టార్లు 16 బంతుల్లో ఈ ఫీట్ సాధించగా, ఈ కుర్రాడు వారిని కూడా వెనక్కి నెట్టేయడం గమనార్హం. తొలి పూర్తి స్థాయి టోర్నీలోనే ఇలాంటి మెరుపు ఇన్నింగ్స్ ఆడటం రాజస్థాన్ ఫ్రాంచైజీకి ఎంతో సంతోషాన్నిస్తోంది.





అన్వేషణ నేత్రం
RNI.No. TELTEL/2010/32434
ఎడిటర్ : గొల్ల రమేష్ | తెలుగు దినపత్రిక



## సినిమా
CINEMA





# కథనార్‌తో మళ్లీ బలమైన పాత్రలో అనుష్క

టాలీవుడ్ స్టార్ హీరోయిన్ అనుష్క శెట్టి 'బాహుబలి' తర్వాత సినిమాల ఎంపికలో జాగ్రత్తగా ముందుకు సాగుతున్న సంగతి తెలిసిందే. అడపాదడపా సినిమాలు చేస్తూ వస్తున్న ఆమె ఇటీవల 'ఘాటీ' సినిమాతో ప్రేక్షకుల ముందుకు వచ్చినా ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయింది. అయితే ఇప్పుడు భారీ అంచనాల మధ్య మలయాళంలో తెరకెక్కుతున్న పీరియాడిక్ మూవీ 'కథనార్'తో మరోసారి ప్రేక్షకులను అలరించేందుకు సిద్ధమవుతోంది.శ్రీ గోకులం మూవీస్ బ్యానర్‌పై గోకులం గోపాలన్ నిర్మాణంలో, దర్శకుడు రోజిన్ థామస్ తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో అనుష్కతో పాటు జయసూర్య, ప్రభుదేవ , సనూప్ సన్, వినీత్, శాండీ మాస్టర్, హరీష్ ఉత్తమన్ తదితరులు కీలక పాత్రలు పోషిస్తున్నారు. మలయాళంలో రూపొందుతున్న ఈ సినిమాను పాన్ ఇండియా స్థాయిలో తెలుగు, తమిళం, కన్నడ, హిందీ భాషల్లో విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు. తాజాగా విడుదలైన 'కథనార్' ట్రైలర్ ప్రేక్షకుల్లో ఆసక్తిని రేకెత్తిస్తోంది. విజువల్స్, సెట్టింగ్స్, పీరియాడిక్ బ్యాక్‌డ్రాప్ సినిమాకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తున్నాయి. ట్రైలర్‌లో అనుష్క కనిపించిన తీరు, ఆమె పాత్రలో ఉన్న గంభీరత, మిస్టరీ ఎలిమెంట్స్ ప్రేక్షకులను ఆకట్టుకుంటున్నాయి. ప్రత్యేకంగా చెప్పాలంటే, ఈ సినిమాలో ఫాంటసీ, హారర్, థ్రిల్లర్ అంశాలను మేళవించి రూపొందించినట్లు ట్రైలర్ ద్వారా స్పష్టమవుతోంది. హాలీవుడ్ స్థాయి విజువల్ ఎఫెక్ట్స్‌తో ఈ సినిమాను రూపొందిస్తున్నట్లు మేకర్స్ చెబుతున్నారు. దీంతో ఈ ప్రాజెక్ట్‌పై అంచనాలు మరింత పెరిగాయి. 'కథనార్'తో అనుష్క మళ్లీ బలంగా కంబ్యాక్ ఇవ్వాలని అభిమానులు కోరుకుంటున్నారు.

# యూట్యూబ్‌లో దురంధర్-2

బాలీవుడ్ నటుడు రణవీర్ సింగ్ ప్రధాన పాత్రలో, ఆదిత్య ధర్ దర్శకత్వంలో తెరకెక్కిన భారీ యాక్షన్ స్పై థ్రిల్లర్ చిత్రం 'ధురంధర్ 2' పైరసీ ఉచ్చులో చిక్కుకుంది. బాక్సాఫీస్ వద్ద రికార్డు వసూళ్లతో దూసుకుపోతున్న ఈ చిత్రం.. యూట్యూబ్‌లో లీక్ కావడం కలకలం రేపుతుంది. ప్రస్తుతం థియేటర్లలో విజయవంతంగా నడుస్తున్న ఈ సినిమా పూర్తి నిడివి గల పైరేటెడ్ వెర్షన్‌ను కొందరు గుర్తుతెలియని వ్యక్తులు యూట్యూబ్‌లో అక్రమంగా అప్‌లోడ్ చేశారు. దీంతో మొబైల్ ద్వారా రికార్డ్ చేసిన దాదాపు 4 గంటల నిడివి గల ఈ వీడియోను అప్పటికే వేలాది మంది నెటిజన్లు వీక్షించారు. అయితే ఈ పైరసీ అప్‌లోడ్‌ను గమనించిన అభిమానులు వెంటనే సోషల్ మీడియా వేదికగా దర్శకుడు ఆదిత్య ధర్‌ను ట్యాగ్ చేస్తూ అలర్ట్ చేశారు. ఇక అభిమానుల నుంచి వచ్చిన సమాచారంతో చిత్రబృందం తక్షణమే రంగంలోకి దిగి, యూట్యూబ్ యాజమాన్యానికి ఫిర్యాదు చేయగా.. ఆ పైరేటెడ్ లింక్‌ను విజయవంతంగా డిలీట్ చేసింది యూట్యూబ్. మరోవైపు ఈ పైరసీ అడ్డంకులు వలన సినిమా బాక్సాఫీస్ వద్ద మాత్రం జోరు తగ్గలేదు. కేవలం రెండు వారాల్లోనే ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా రూ. 1400 కోట్ల మైలురాయికి చేరువలో ఉంది. ఇప్పటికే నార్త్ అమెరికాలో అత్యధిక వసూళ్లు సాధించిన భారతీయ చిత్రంగా నిలిచి 'బాహుబలి 2' రికార్డులను సైతం అధిగమించింది. రణవీర్ సింగ్‌తో పాటు సంజయ్ దత్, ఆర్ మాధవన్, అర్జున్ రాంపాల్ వంటి భారీ తారాగణం నటించిన ఈ చిత్రం ప్రస్తుతం రికార్డుల వేటను కొనసాగిస్తోంది.

# వరుస సినిమాలో ప్రభాస్ బిజీ

ప్రస్తుతం స్టార్ హీరోలు ఏడాదికి ఒక సినిమాని రిలీజ్ చేయడానికే భారీగా శ్రమిస్తున్న సమయంలో, పాన్ ఇండియా స్టార్ ప్రభాస్ మాత్రం తన పని తీరుతో ఏకకాలంలో మూడు భారీ ప్రాజెక్టులను నిర్వహిస్తూ చిత్రపరిశ్రమలో చర్చనీయాంశంగా మారారు. ప్రస్తుతం ప్రభాస్ 'స్పిరిట్', 'ఫౌజీ', 'కల్కి 2' వంటి మూడు భారీ బ్జడెట్ చిత్రాల్లో నటిస్తున్నారు. ఈ మూడు సినిమాలు భిన్నమైన కథాంశాలు, వేర్వేరు పాత్రలతో తెరకెక్కుతున్నాయి. అలాంటి పరిస్థితుల్లో ఒకేసారి షూటింగ్‌లలో పాల్గొనడం పెద్ద సవాలే. రెండు మూడు నెలలుగా 'ఫౌజీ', 'స్పిరిట్' షూటింగ్‌లలో నిరంతరం పాల్గొంటున్న ప్రభాస్, ఇప్పుడు 'కల్కి 2' షూటింగ్‌కు కూడా రెడీ అవుతున్నారు. ఇప్పటివరకు ఆయన లేకుండా తీసిన సన్నివేశాలను పూర్తి చేసిన దర్శకుడు నాగ్ అశ్విన్, ఇక నుంచి ప్రభాస్‌తో కూడిన షూటింగ్‌ను ప్రారంభించేందుకు సిద్ధమవుతున్నారు. మూడు సినిమాలు ఒకేసారి చేయడం వల్ల ప్రభాస్ షెడ్యూల్ మరింత బిజీగా మారనుంది. రాత్రింబవళ్లు షూటింగ్‌లతో గడపాల్సి వస్తోంది. ప్రతి సినిమాలో వేర్వేరు లుక్స్, బాడీ లాంగ్వేజ్ అవసరం కావడంతో పాత్రల మధ్య తేడాను కచ్చితంగా చూపించాల్సిన బాధ్యత కూడా ఉంది.

Printed Published and owned by Golla Ramesh, No.8-4-111, NG. Colony, Ramagiri, Nalgonda-508001 Telangana State, Printed at Prabhu publication H.No.6-4-111. NC Colony Ramaghir, Nalgonda-508001 Telangana State Publisheds H.No.6-4-111. NG. Colony, Ramagiri, Netponde-508001 Telanagan Stsos, Editor T Golla RN.No. TELTEL/201002434